మెట్రో డీపీఆర్ జాప్యం

రెండో దశకు కేంద్ర బడ్జెట్‌లో కేటాయింపు శూన్యం

డీపీఆర్‌ను కేంద్రానికి సమర్పించి ఉంటే బడ్జెట్‌లో నిధులు దక్కేవి

రాష్ట్ర ప్రభుత్వ అలసత్వం • మరో బడ్జెట్ దాకా ఆగాల్సిందేనా?

సిటీబ్యూరో, జూలై 23(నమస్తే తెలంగాణ): కేంద్ర బడ్జెట్‌లో ప్రతిష్టాత్మక హైదరాబాద్ మెట్రో రైలు ప్రాజెక్టు ఊసేలేదు. గత కేసీఆర్ ప్రభుత్వంతో పాటు తాజాగా కాంగ్రెస్ ప్రభుత్వం సైతం రెండో దశ మెట్రోను వివిధ మార్గాల్లో నిర్మించాలని ప్రతిపాదించినా, కేంద్రం మాత్రం మొండి చేయి చూపింది. దేశంలోని ప్రధాన మెట్రో నగరాల్లో ఒకటిగా అభివృద్ధి చెందుతున్న హైదరాబాద్ మహానగరంలో ప్రజా రవాణా వ్యవస్థలో మెట్రో రైలు ఎంతో కీలకమైంది. అలాంటి ప్రాజెక్టును నగరం నలుమూలలా విస్తరించేందుకు రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిపాదనలను కేంద్రం ముందు ఉంచినా ఫలితం లేకుండా పోయింది. కాగా, రెండో దశ మెట్రోకు సంబంధించిన సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్)ను రూపొందించి సకాలంలో కేంద్రానికి సమర్పించకపోవడం వల్లే ఎలాంటి నిధులు కేటాయించలేకపోయిందనే వాదనలు వినిపిస్తున్నాయి. సాక్షాత్తు రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి సైతం మెట్రో ప్రాజెక్టుకు నిధులు కేటాయిస్తారని ఆశించామని పేర్కొన్నారు. ప్రభుత్వం ఏర్పాటై ఏడు నెలలు గడిచినా కేంద్ర ముందు సమగ్ర ప్రాజెక్టు నివేదికను(డీపీఆర్) ఎందుకు ఉంచలేదని ఒక వైపు నగర వాసులు ప్రశ్నిస్తున్నారు.

రాష్ట్ర ప్రభుత్వ అలసత్వం..

నగరంలో మెట్రో విస్తరణ అత్యవసరమని గుర్తించిన గత కేసీఆర్ ప్రభుత్వం సుమారు 200 కి.మీ దూరం నిర్మించే ప్రతిపాదనలు సిద్ధం చేసింది. అందులో కొన్ని మార్గాలకు సంబంధించిన ప్రతిపాదనలను కేంద్రం ముందుంచింది. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆ ప్రతిపాదనలను పూర్తిగా పక్కన పెట్టి కేవలం 70 కి.మీ మేర రెండో దశ మెట్రోను నిర్మించాలని కొత్త ప్రతిపాదనలు చేసింది. దానికైనా డీపీఆర్‌ను సిద్ధం చేసి కేంద్రం ముందు పెట్టకపోవడంతో కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో మెట్రో రెండో దశకు ప్రాధాన్యత ఇవ్వలేదు. మెట్రో రైలు ప్రాజెక్టుకు సంబంధించి నిధులు రాబట్టడంలో రాష్ట్ర ప్రభుత్వం అలసత్వం వహించిందని బడ్జెట్ నిపుణులు పేర్కొంటున్నారు. గతేడాది డిసెంబర్ – జనవరి నెలల్లోనే రెండో దశ మెట్రో డీపీఆర్ సిద్ధం చేస్తున్నామని ప్రకటించి ఏడు నెలలు గడిచినా, డీపీఆర్ మాత్రం ఇప్పటికీ పూర్తి చేయించలేకపోయింది రాష్ట్ర ప్రభుత్వం. మెట్రో రెండో దశ ప్రాజెక్టుకు సంబంధించిన డీపీఆర్‌ను కేంద్ర ప్రభుత్వం ముందు ఉంచి ఉంటే దానిని పరిశీలించి ఈ బడ్జెట్‌లో కొంతైనా కేటాయింపులు ఉండేవని కొందరు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. మొదటి దశ మెట్రో పనులు 2021 నాటికే పూర్తయినా, అప్పటి నుంచి రెండో దశపై దృష్టి సారించినా డీపీఆర్‌ను రూపొందించడంలో మాత్రం హైదరాబాద్ మెట్రో రైలు సంస్థ విఫలమైందని నిపుణులు పేర్కొంటున్నారు. మెట్రో రైలు అవసరమైన మార్గాలన్నీ తెలిసిన మెట్రో అధికారులు డీపీఆర్‌ను రూపొందించడంలో తీవ్ర జాప్యం చేయడం వల్లే కేంద్ర బడ్జెట్‌లో నిధులు కేటాయింపు జరగలేదనే అభిప్రాయాన్ని బీజేపీకి చెందిన ప్రజా ప్రతినిధులు వ్యక్తం చేస్తున్నారు. మెట్రోకు కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు దక్కాలంటే వచ్చే ఏడాదిలో ప్రవేశ పెట్టే బడ్జెట్ దాకా వేచిచూడాల్సిందేనా అంటూ నగర వాసులు పెదవి విరుస్తున్నారు.

గాంధీ సూపరింటెండెంట్‌గా డా. రాజ కుమారి బాధ్యతల స్వీకరణ

డాక్టర్ రాజ కుమారి

డాక్టర్ ఇందిర

బన్సీలాల్‌పేట్, జూలై 23: సికింద్రాబాద్‌లోని గాంధీ దవాఖాన నూతన సూపరింటెండెంట్‌గా డాక్టర్ సీహెచ్ఎన్ రాజకుమారి మంగళవారం బాధ్యతలను చేపట్టారు. ఆరేండ్లుగా ఆమె నల్గొండ జిల్లా దవాఖానలో సూపరింటెండెంట్‌గా పనిచేసి, బదిలీపై ఇక్కడికి వచ్చారు. 1988వ బ్యాచ్‌లో గాంధీ వైద్య కళాశాలలో ఆమె ఎంబీబీఎస్ పూర్తి చేసి అనంతరం, గైనకాలజీలో పీజీ కూడా ఇక్కడే చదివారు. 1997లో వరంగల్‌లోని కేఎంసీలో సహాయ ప్రొఫెసర్‌గా విధుల్లో చేరారు. 1998 నుంచి 2018 వరకు గాంధీ దవాఖానలో గైనకాలజీ విభాగంలో సహాయ ప్రొఫెసర్‌గా పనిచేశారు. 2018 నుంచి 2024 వరకు నల్గొండ జిల్లా దవాఖానలో సూపరింటెండెంట్‌గా పనిచేశారు. గాంధీ దవాఖానలో మంగళవారం ఆమె బాధ్యతలను చేపట్టిన వెంటనే అన్ని వార్డులకు తిరిగారు. ఓపీ, ఎమర్జెన్సీ, ఐసీయూలు, ఎంసీహెచ్ భవనాలను సందర్శించారు. గాంధీ దవాఖానలో పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తానని ఆమె అన్నారు. ఇక్కడ పనిచేసిన డాక్టర్ ఎం.రాజారావు భువనగిరి ప్రభుత్వ దవాఖాన సూపరింటెండెంట్‌గా బదిలీపై వెళ్ళారు.

ప్రిన్సిపాల్‌గా డా. ఇందిర..

గాంధీ వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌గా డాక్టర్ కె.ఇందిర మంగళవారం బాధ్యతలను స్వీకరించారు. ఆమె ఉస్మానియా వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ పూర్తి చేశారు. ఆ తరువాత, గాంధీ వైద్య కళాశాలలో ఎండీ ఫార్మకాలజీ చదివారు. 2011 నుంచి 2015 వరకు గాంధీ దవాఖానలో పనిచేశారు. 2015 నుంచి తొమ్మిదేండ్లు పాటు నిజామాబాద్ వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌గా పనిచేశారు. తాజాగా జరిగిన బదిలీలలో ఆమె ఇక్కడికి వచ్చారు. ఇక్కడ పనిచేసిన డాక్టర్ కే.రమేశ్ రెడ్డి, యాదాద్రి భువనగిరి వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌గా బదిలీపై వెళ్ళారు.

కొత్త ఆవిష్కరణలకు కేంద్ర బడ్జెట్ ప్రోత్సాహం

టీ హబ్ సీఈఓ ఎం.ఎస్.రావు

సిటీబ్యూరో, జూలై 23 (నమస్తే తెలంగాణ): కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్ దేశ వ్యాప్తంగా కొత్త ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు అనుకూలంగా ఉంది. స్టార్టప్‌లలో పెట్టుబడులు పెట్టే వారికి విధించే ఏంజిల్ పన్ను రద్దు అన్న కీలకమైన నిర్ణయంతో దేశీయ పెట్టుబడిదారులే కాకుండా విదేశాలకు చెందిన వారు సైతం పెద్ద మొత్తంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వస్తారు. దీని వల్ల స్టార్టప్‌లకు ఆర్థికంగా ఎంతో మద్దతు లభించి మంచి ఆవిష్కరణలు వచ్చేందుకు అవకాశం ఉంటుంది. అంతరిక్ష రంగాన్ని ప్రోత్సహించడానికి రూ.1000 కోట్ల వెంచర్ క్యాంపిటల్ ఫండ్‌ను ఏర్పాటు చేయడం మంచి నిర్ణయం. ఈ గణనీయమైన పెట్టుబడి వినూత్న స్టార్టప్‌లు, సంచలనాత్మక పరిశోధనలకు మద్దతు ఇచ్చేలా ఉంది. ఫలితంగా అంతరిక్ష ఆర్థిక వ్యవస్థలో వృద్ధిరేటు పెరిగేందుకు, అంతరిక్ష సాంకేతికత, ప్రయోగాల్లో భారతదేశాన్ని అగ్రస్థానంలో నిలిపేందుకు దోహదం చేస్తుంది.

ఉద్యమకారులకు ఇంటిని నిర్మించి ఇవ్వాలి

సమావేశంలో మాట్లాడుతున్న తెలంగాణ ఉద్యమ నాయకులు

రవీంద్రభారతి, జూలై 23: ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలంతో పాటు ఇంటిని నిర్మించి ఇవ్వాలని తెలంగాణ ఉద్యమకారుల సమితి డిమాండ్ చేసింది. ఈ మేరకు బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో తెలంగాణ ఉద్యమ నాయకులు తుమ్మల ప్రపుల్ రాంరెడ్డి, సుల్తాన్ యాదగిరి, రంగారెడ్డి, కేపీఎస్ ప్రసాద్, వెంకటస్వామి, వెంకట నారాయణలు కలిసి సంయుక్త నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ, తెలంగాణ యోధుల విస్తృత కమిటీని వెంటనే ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. తెలంగాణ ఉద్యమకారుల తొలిదశ, మలిదశ ఉద్యమకారులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రూ.30 వేల గౌరవ వేతనంతో పాటు ఉచిత బస్సు పాసు సౌకర్యం కల్పించాలని, అలాగే ఆరోగ్య బీమా 20 లక్షల వరకు ఇవ్వాలని, విద్యా, ఉద్యోగాల భర్తీలో 5 శాతం ఉద్యమకారుల కుటుంబాలకు కేటాయించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కొంపల్లి సాయిలు, రాజేష్, కుర్మయ్య, కె.చంద్రశేఖర్, సుజి, కొండస్వామి, దయానంద్ పాల్గొన్నారు.

టీబీ నిర్మూలనకు కృషి చేద్దాం

ఎన్ఐఎన్‌లో జాతీయ ఆరోగ్య సంస్థ, టీబీ సెల్ ఆధ్వర్యంలో వర్క్‌షాప్

కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ప్రతినిధులు

సిటీబ్యూరో, జూలై 23(నమస్తే తెలంగాణ): మున్సిపాలిటీల్లో టీబీ మరణాలు, వ్యాధిని నిర్మూలించేలా ఆరోగ్య నగరం (స్వస్థ్యా నగరం) పేరిట ప్రత్యేక కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర జాతీయ టీబీ నిర్మూలన ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. జాతీయ పోషకాహార సంస్థలో ప్రత్యేక వర్క్ షాప్ నిర్వహించి వ్యాధి నియంత్రణ, మరణాలను తగ్గించడంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై స్టేక్ హోల్డర్లతో కలిసి చర్చించారు. కార్యక్రమంలో రాష్ట్ర టీబీ నిర్మూలన సంస్థ, ఆరోగ్య శాఖతో పాటు, ప్రపంచ ఆరోగ్య సంస్థ, యూఎస్ఎయిడ్ ఇండియా, వద్వావానీ ఏఐ వంటి సంస్థలు ప్రాతినిధ్యం వహించాయి. కార్యక్రమంలో భాగంగా పీర్జాదిగూడ, బోడుప్పల్, పోచారం వంటి మున్సిపాలిటీల సహకారంతో మూడేళ్ల కాలంగా చేపట్టిన పైలట్ ప్రాజెక్టు గురించి ప్రస్తావించారు. ఆయా మున్సిపాలిటీల్లో క్షయ పూర్తిగా నియంత్రణలోకి వచ్చిందని, టీబీ సంబంధిత మరణాలు కూడా తగ్గినట్లుగా పేర్కొన్నారు. భవిష్యత్తులో రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీల్లో ఈ తరహా కార్యక్రమాలతో టీబీ నిర్మూలనకు కృషి చేస్తామని రాష్ట్ర ఆరోగ్య శాఖ, టీబీ నిర్మూలన యంత్రాంగం పేర్కొంది.

ముదిరాజులను బీసీ ఏ లోకి మార్చాలి

ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్

బన్సీలాల్‌పేట్, జూలై 23: ముదిరాజులను బీసీ డీ నుంచి ఏ లోకి మార్చే వరకు ఉద్యమాన్ని తీవ్రం చేస్తామని ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ అన్నారు. సికింద్రాబాద్ బోయిగూడలోని ముదిరాజ్ భవన్‌లో మహాసభ రాష్ట్ర కమిటీ సమావేశంలో మంగళవారం ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అభయహస్తం అసెంబ్లీ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా ఎన్నికలకు ముందు కామారెడ్డిలో జరిగిన ఏఐసీసీ బీసీ డిక్లరేషన్‌లో సభలో ఇచ్చిన హామీ ప్రకారం ముదిరాజుల దీర్ఘకాల కోరిక అయిన బీసీ గ్రూపు మార్పునకు సహకరించాలని ఆయన అన్నారు. గత సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జీఓ నం.15/2009 ద్వారా ముదిరాజులకు న్యాయం చేశారని, కొందరు సుప్రీంకోర్టుకు వెళ్ళడంతో అది నిలిచిపోయిందన్నారు. ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చొరవ తీసుకుని ఆ జీవోను పునరుద్ధరించాలని, దాని ప్రకారం, ఆర్థికంగా వెనకబడిన ముదిరాజులను బీసీ–ఏ లోకి మార్చాలన్న డిమాండ్ వందశాతం న్యాయ సమ్మతమైనదన్నారు. సమావేశంలో 33 జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులతో పాటు రాష్ట్ర నాయకులు పాల్గొన్నారు.

రేపట్నుంచి 15 ఏండ్ల పిల్లలందరికీ వ్యాక్సినేషన్

హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

సిటీబ్యూరో, జూలై 23(నమస్తే తెలంగాణ): మెదడు వాపు వ్యాధి(జపనీస్ ఇన్ఫాలిటీస్) నివారణకు జూలై 25 నుంచి ఆగస్టు 15 వరకు వ్యాక్సినేషన్ ప్రక్రియ జరుగుతుందని, ప్రభుత్వ పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలు, మదర్సాలలో నివారణ టీకా వ్యాక్సిన్ కార్యక్రమం వందశాతం చేపట్టాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి చెప్పారు. తొమ్మిది నెలల నుంచి 15 ఏండ్ల వయస్సు గల పిల్లలందరికి వ్యాక్సిన్ ప్రక్రియ పూర్తి చేయాలని సూచించారు. మైనార్టీ ప్రాంతాలల్లో ముస్లిం మత పెద్దలు సహకరించాలని చెప్పారు. ఆశా వర్కర్లు ఇంటింటికీ వెళ్లి వ్యాక్సినేషన్ చేపట్టాలని ఆదేశించారు.

దాశరథి రచనలు ఉద్యమంలో కీలక భూమికలు

ఎమ్మెల్సీ సురభి వాణీదేవి

పురస్కారాన్ని అందెశ్రీకి ప్రదానం చేస్తున్న ఎమ్మెల్సీ వాణీదేవి, రమణాచారి

తెలుగు యూనివర్సిటీ, జూలై 23: శ్రీకృష్ణదేవరాయ తెలుగు భాషా నిలయం ప్రతిష్టాత్మకంగా ప్రతి ఏడాది ప్రదానం చేస్తున్న మహాకవి దాశరథి కృష్ణమాచార్య సాహితీ పురస్కారాన్ని – 2024 సంవత్సరానికి గాను ప్రజా వాగ్గేయకారుడు అందెశ్రీకి అందించారు. మంగళవారం సాయంత్రం సుల్తాన్‌బజార్‌లో గల భాషా నిలయం ఆడిటోరియంలో ప్రదానం చేశారు. పురస్కారం కింద పదివేల నగదు, జ్ఞాపిక, శాలువాతో అందెశ్రీని సత్కరించారు. విశ్రాంత ఐఏఎస్ అధికారి డాక్టర్ కేవీ రమణాచారి అధ్యక్షతన జరగనున్న ఈ కార్యక్రమంలో శాసనమండలి సభ్యురాలు సురభి వాణీదేవి హాజరై ప్రసంగించారు. కవులు, రచయితలను సత్కరించుకోవడం మన సంప్రదాయమన్నారు. సమాజహితం కోసం అనేక ప్రక్రియలలో రచనలు చేసిన దాశరథి తెలంగాణ రాష్ట్ర సాధనలో ఆయన పాటలు ప్రజలలో చైతన్యం తీసుకురావడంలో కీలకభూమిక పోషించాయన్నారు. భాషా నిలయం ఉపాధ్యక్షులు డాక్టర్ కె.చంద్ర ప్రకాష్ రావు, గౌరవ కార్యదర్శి టి.ఉడయవర్లు పాల్గొన్నారు.

గోరటి వెంకన్నకు మా భూమి - డాక్టర్ దాశరథి పురస్కారం

జూబ్లీహిల్స్, జూలై 23: ప్రజా కవులు డాక్టర్ దాశరథి, గోరటి వెంకన్నలు నిత్యం పీడిత, పేదల పక్షాన ఉండేవారని, దాశరథి పేరిట నెలకొల్పిన ప్రజా సాహిత్య పురస్కారం గోరటి వెంకన్నకు అందించడం అభినందనీయమని తెలంగాణ హైకోర్టు జడ్జ్ జస్టిస్ నగేష్ భీమపాక అన్నారు. అభ్యుదయ కవి డాక్టర్ దాశరథి కృష్ణమాచార్య శత జయంతి సంవత్సరం పురస్కరించుకుని 'మా భూమి' సాహితీ సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో ' మా భూమి–డాక్టర్ దాశరథి' ప్రజా సాహిత్య పురస్కారాన్ని నెలకొల్పారు. నగరంలోని చింతలకుంట వాసవిశ్రీ నిలయంలో మంగళవారం జరిగిన అభినందన సభా కార్యక్రమంలో ఈ పురస్కారాన్ని వెంకన్నకు అందజేశారు. పురస్కార గ్రహీత గోరటి వెంకన్న మాట్లాడుతూ, తెలంగాణ గొప్ప కవులు, రచయితలకు పుట్టినిల్లని, అందులో ఒకడినై తెలంగాణ సమాజంలోని కళ్ళెదుటి జీవన చిత్రాలే తన పాటకు స్ఫూర్తి అని చెప్పి, మా ఊరి సంత పాట పాడి ఆహుతులను అలరింపజేశారు. ఈ పురస్కారాన్ని ప్రతి సంవత్సరం అందిస్తామని, గాయపడిన దాశరథి గుండెల్లో రాయబడని కావ్యాలన్నీ గోరటి వెంకన్న రాయాలని మా భూమి సమన్వయకర్త నరసింహ ప్రసాద్ గొర్రెపాటి అన్నారు. జిల్లా అదనపు న్యామూర్తులు కె.మురళీ మోహన్, మండ వెంకటేశ్వర రావు, సీనియర్ జర్నలిస్ట్ తాడి ప్రకాశ్, రచయిత కూనపురాజు కుమార్‌లతో కలిసి దుశ్శాలువాతో సత్కరించి ప్రశంసా, పురస్కార పత్రాన్ని ప్రదానం చేశారు. కార్యక్రమంలో మా భూమి సాహితీ సాంస్కృతిక వేదిక సభ్యులు రఘునందన్, ఉదయ్ శంకర్, నాగిరెడ్డి పాల్గొన్నారు.

స్టాండింగ్ కమిటీ ఎన్నిక ఏకగ్రీవమే!

సిటీబ్యూరో, జూలై 23(నమస్తే తెలంగాణ): జీహెచ్ఎంసీ స్థాయీ సంఘం సభ్యుడి ఎన్నిక ఏకగ్రీవమయ్యే అవకాశాలు ఉన్నాయి. ఎంఐఎం పార్టీకి చెందిన షేక్‌పేట డివిజన్ కార్పొరేటర్ మహమూద్ రషీద్ ఫర్హాజుద్దీన్ నామినేషన్ దాఖలు చేయగా, మంగళవారం ఎన్నికల విభాగం అధికారులు సదరు నామినేషన్‌ను పరిశీలించారు. గత నెల 4న ఎర్రగడ్డ డివిజన్ ఎంఐఎం కార్పొరేటర్ షాహీన్ బేగం అనారోగ్యంతో మృతి చెందారు. ఈ స్థానాన్ని భర్తీ చేసేందుకు ఈ నెల 12న సభ్యుడి ఎన్నికకు అధికారులు నోటిఫికేషన్ విడుదల చేసిన సంగతి తెలిసిందే. అయితే కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల నుంచి ఏ ఒక్కరూ నామినేషన్ దాఖలు చేయకపోవడంతో ఎన్నిక ఏకగ్రీవమైనట్లుగా భావించాల్సి ఉంటుంది. ఈ విషయంపై అధికారులు ఈ నెల 26 తర్వాత అధికారికంగా ప్రకటించే అవకాశాలు ఉన్నాయి. కాగా 15 మంది సభ్యులతో స్టాండింగ్ కమిటీ ఏర్పడగా..సిట్టింగ్ స్థానం ఎంఐఎం సభ్యుడినే వరించనున్నది.

'ఛే నంబర్'లో ట్రాఫిక్ ఆంక్షలు

సిటీబ్యూరో, జూలై 23 (నమస్తే తెలంగాణ): అంబర్‌పేట్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఛే నంబర్ జంక్షన్ నుంచి గోల్నాక వరకు ఫ్లైఓవర్ సూపర్ స్ట్రక్చర్ నిర్మాణ పనులు జరుగుతుండటంతో నేటి నుంచి ఛే నంబర్ జంక్షన్ పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తున్నట్లు నగర పోలీస్ కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి వెల్లడించారు. ఛే నంబర్ నుంచి గోల్నాక వైపు వాహనాలకు అనుమతి ఉండదని, ఈ వాహనాలను జిందా తిలిస్మాత్ వైపు మళ్లిస్తున్నట్లు తెలిపారు. గోల్నాక నుంచి ఛే నంబర్ వరకు యథావిధిగా అనుమతి ఉంటుందని, ఎన్‌సీసీ గేట్ నుంచి ఛే నంబర్ జంక్షన్ వైపు వచ్చే ఆర్టీసీ బస్సులను తిలక్‌నగర్ ఎక్స్ రోడ్డులో ఫీవర్ దవాఖాన వైపు మళ్లిస్తున్నట్లు తెలిపారు.

ఆగస్టు 1, 2న టీజీపీ ఎస్సీ గ్రూప్ 2 మాక్ టెస్ట్

సిటీబ్యూరో, జూలై 23(నమస్తే తెలంగాణ): తెలంగాణ మైనార్టీ స్టడీ సర్కిల్, కెరీర్ కౌన్సెలింగ్ సెంటర్ ఆధ్వర్యంలో తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ గ్రూప్ –2 మాక్ టెస్ట్ ఆగస్టు 1, 2న నిర్వహించనున్నట్లు హైదరాబాద్ జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు తెలంగాణ మైనార్టీ స్టడీ సర్కిల్‌లో ఈనెల 30 లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

పటాన్‌చెరు - దిల్‌షుక్‌నగర్ రూట్‌లో ఎలక్ట్రిక్ బస్సులు

సిటీబ్యూరో, జూలై 23 (నమస్తే తెలంగాణ): పటాన్‌చెరు నుంచి దిల్‌షుక్‌నగర్ వరకు 10 ఎలక్ట్రిక్ ఏసీ మెట్రో బస్సుల సేవలు రేపట్నుంచి అందుబాటులో ఉంటాయని గ్రేటర్ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వి. వెంకటేశ్వర్లు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. లింగంపల్లి, గచ్చిబౌలి, మెహిదీపట్నం, లక్డీకాపూల్, అబిడ్స్, కోఠి, మలక్‌పేట్ మీదుగా ఈ బస్సులు నడుస్తాయన్నారు. లింగంపల్లి నుంచి ఉదయం 5 గంటలకు, చివరి బస్సు 10:30 గంటలకు, దిల్‌షుక్‌నగర్ నుంచి ఉదయం 6:40 గంటలకు, చివరి బస్సు 11:53లకు ఉంటుందన్నారు.

టీజీ సీపీజీఈటీ కీపై అభ్యంతరాలు

ఉస్మానియా యూనివర్సిటీ, జూలై 23: రాష్ట్ర వ్యాప్తంగా అన్ని యూనివర్సిటీల పరిధి, అన్ని పీజీ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే టీజీ సీపీజీఈటీ –2024 పరీక్షల ప్రాథమిక కీని విడుదల చేసినట్లు సీపీజీఈటీ కన్వీనర్ ప్రొఫెసర్ ఐ. పాండు రంగా రెడ్డి తెలిపారు. ఈ కీపై ప్రాథమిక అభ్యంతరాలను స్వీకరించనున్నట్లు చెప్పారు. అభ్యర్థులు తమ అభ్యంతరాలను cpget.helpdesk@gmail.com in మెయిల్‌కు ఈ నెల 25వ తేదీ నుంచి పంపించాలని సూచించారు. పరీక్షలు ఈ నెల 6వ తేదీ నుంచి 16వ తేదీ వరకు నిర్వహించినట్లు చెప్పారు. మొత్తమ్మీద 73,342 మంది అభ్యర్థులు టీజీ సీపీజీఈటీ పరీక్షలకు దరఖాస్తు చేసుకున్నారని, వారిలో 64,765 మంది పరీక్షలకు హాజరయ్యారని పేర్కొన్నారు. మొత్తమ్మీద హాజరు శాతం 88.31గా నమోదైనదన్నారు.

లైంగిక వేధింపులకు పాల్పడిన ఉద్యోగి పై చర్యలు

విధుల నుంచి తప్పిస్తూ జీహెచ్ ఎంసీ కమిషనర్ ఉత్తర్వులు

సిటీబ్యూరో, జూలై 23 (నమస్తే తెలంగాణ) : తోటి ఉద్యోగినిపై లైంగిక వేధింపులకు పాల్పడిన జీహెచ్ఎంసీ స్వచ్ఛ భారత్ మిషన్ ప్రాజెక్టు ఆఫీసర్ భరత్‌ను ఉద్యోగం నుంచి తప్పిస్తూ కమిషనర్ ఆమ్రపాలి మంగళవారం ఆదేశాలు జారీ చేసింది. శానిటేషన్ మేనేజ్‌మెంట్‌లో భాగంగా స్వచ్ఛ భారత్ మిషన్ ప్రాజెక్టు ఆఫీసర్‌గా భరత్ గడిచిన ఏడున్నరేళ్లుగా జీహెచ్ఎంసీలో ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో విధులు నిర్వర్తిస్తున్నాడు. ఈ నేపథ్యంలోనే ఓ ఎన్విరాన్‌మెంట్ సైంటిస్ట్ (మహిళా ఉద్యోగి) పట్ల భరత్ లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు. ఈ విషయాన్ని బాధిత మహిళ దోమలగూడ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పాటు కమిషనర్ ఆమ్రపాలి దృష్టికి తీసుకెళ్లింది. విచారణ జరిపిన అదనపు కమిషనర్ రవికిరణ్ లైంగిక వేధింపులు నిజమేనని తేల్చారు. దీంతో భరత్‌ను జీహెచ్ఎంసీ నుంచి పూర్తిగా తప్పిస్తూ కమిషనర్ నిర్ణయం తీసుకున్నారు.

విద్యార్థినికి ల్యాప్‌టాప్ అందజేసిన కేటీఆర్

సిటీబ్యూరో, జూలై 23 (నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్ పుట్టినరోజు సందర్భంగా గిఫ్ట్ ఏ స్మైల్ కార్యక్రమంలో భాగంగా గజ్వేల్ నియోజకవర్గానికి చెందిన విద్యార్థిని చెలిమెల మమతకు ల్యాప్‌టాప్ అందజేశారు. టీఎస్ టీఎస్ మాజీ చైర్మన్ పాటిమీది జగన్మోహన్ రావు ఆధ్వర్యంలో మంగళవారం తెలంగాణ భవన్‌లో కేటీఆర్ మమతకు ఈ గిఫ్టును అందించారు. విద్యార్థిని మమత ఇంటర్‌లో స్టేట్ 3వ ర్యాంకుతో పాటు 98శాతం మార్కులు సాధించారు.

ఆర్ట్స్ కళాశాల ఆవరణలో స్మితా సభర్వాల్ చిత్రపటంతో నిరసన తెలుపుతున్న వికలాంగులు

ఓయూలో స్మిత చిత్రపటాలు దహనం

పోలీసులకు దివ్యాంగుల ఫిర్యాదు

ఉస్మానియా యూనివర్సిటీ, జూలై 23: దివ్యాంగులను అవమానించేలా సీనియర్ ఐఏఎస్ అధికారి స్మితా సభర్వాల్ మాట్లాడిందని ఉస్మానియా యూనివర్సిటీలో వికలాంగులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆర్ట్స్ కళాశాల ఆవరణలో స్మితా సభర్వాల్ చిత్రపటాలు తగులబెట్టారు. అనంతరం, ఆమెపై చర్యలు తీసుకోవాలని ఓయూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పల్స అంజనేయులు గౌడ్ మాట్లాడుతూ, సోషల్ మీడియా వేదికగా ఆమె చేసిన వ్యాఖ్యలు దివ్యాంగుల మనోభావాలను దెబ్బతీసేలా ఉన్నాయని అభిప్రాయపడ్డారు. తక్షణమే ఆమెపై చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో దివ్యాంగ విద్యార్థులు, పరిశోధక విద్యార్థులు పాల్గొన్నారు.

రియల్ రంగం మరింత పురోగమించేలా..

కేంద్ర బడ్జెట్‌లో మౌలిక, గృహ నిర్మాణ రంగానికి పెద్ద పీట

రియల్ ఎస్టేట్‌ను ప్రభావితం చేసేలా ఉంది

క్రెడాయ్ హైదరాబాద్ ప్రెసిడెంట్ రాజశేఖర్ రెడ్డి

సిటీబ్యూరో, జూలై 23(నమస్తే తెలంగాణ): మౌలిక వసతులు, గృహ, నిర్మాణ రంగాన్ని ప్రోత్సహించేలా పట్టణాభివృద్ధి ప్రణాళికలు, రెవెన్యూ రికార్డుల డిజిటలైజేషన్ వంటి చర్యలతో రియల్ ఎస్టేట్ రంగానికి కేంద్ర బడ్జెట్‌లో సముచిత స్థానం దక్కిందని క్రెడాయ్ హైదరాబాద్ ప్రెసిడెంట్ రాజశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. కేంద్ర బడ్జెట్ తీరుతెన్నులు, ప్రయోజనాలు, రియల్ ఎస్టేట్ రంగానికి ఉన్న ప్రాధాన్యతల గురించి క్రెడాయ్ హైదరాబాద్ జనరల్ సెక్రటరీ జగన్నాథరావు మీడియాతో చర్చించారు. ఈ సందర్భంగా రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ, కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రతిపాదనలను క్రెడాయ్ స్వాగతిస్తున్నట్లుగా పేర్కొన్నారు. దేశంలో మౌలిక వసతులు, పట్టణాభివృద్ధి, రెవెన్యూ సంస్కరణలన్నీ కూడా రియల్ ఎస్టేట్ రంగాన్ని ప్రోత్సహిస్తాయన్నారు. అదే